# రేపటి నుంచే బ్రిక్స్ సదస్సు

- రెండు రోజుల పాటు సదస్సు నిర్వహణ
- సదస్సుకు భారీ భద్రత
- 15 వేల మంది పోలీసులతో బందోబస్తు
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌పై ఆంక్షలు
- ప్రత్యేక కెమెరాలతో నిఘా
- ప్రముఖుల కోసం 3 వేల హోటల్ గదుల బుకింగ్
- బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్ రాక..!





3

శనార్తి తెలంగాణ

telanganarajyadhikaraparty.in

సంపుటి : 06 | సంచిక : 12 (కాంప్లిమెంటరీ కాపీ) | ఎడిటర్ : తీన్మార్ మల్లన్న | శుక్రవారం 11-09-2026 | పేజీలు : 3

# కాంగ్రెస్ ట్రాప్‌లో బీఆర్ఎస్?



- రేవంత్ మైండ్ గేమ్
- కారు డిఫెన్స్
- ప్రజా సమస్యలు గాయబ్...
- పొలిటికల్ రచ్చే నయా ట్రెండ్
- ఎజెండా రేవంత్‌దే... 'కారు'ది ఒత్తిడే..
- ప్రతిపక్షంలో ఆవేశం స్టార్లు
- సభా రచ్చ... కాంగ్రెస్‌కే అడ్వాంటేజ్!
- చేతిలో ఆయుధాలున్నా... తప్పిన ప్రతిపక్ష గురి!
- వ్యూహంలో రేవంత్... ఆవేశంలో బిఆర్ఎస్
- పొలిటికల్ ఘర్షణల్లోకి మళ్లిన చర్చ
- సామాజిక కార్డుతో కాంగ్రెస్ ప్రతిదాడి
- వ్యక్తిగత కౌంటర్లకే పరిమితం
- కావాలనే అసలు సమస్యలను వదిలేస్తున్నారా?


**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయాలు తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. తెలంగాణ శాసనసభ వేదికగా సాగుతున్న రాజకీయ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే.. ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్, అధికార కాంగ్రెస్ పన్నిన వ్యూహాత్మక పొలిటికల్ మైండ్ గేమ్‌లో చిక్కుకుని తీవ్ర డిఫెన్స్‌లోకి వెళ్లిపోయిందనే అభిప్రాయం బలపడుతోంది. ప్రభుత్వాన్ని నేరుగా ప్రజా సమస్యలు, పాలనాత్మక లోపాలపై నిలదీయాల్సిన కీలక తరుణంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్దేశిస్తున్న రాజకీయ ఎజెండా చుట్టూనే ప్రతిపక్షం తిరగాల్సి రావడం ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వాన్ని కార్నర్ చేసేందుకు చేతిలో బోలెడంత ప్రజా సమస్యల కంటెంట్ ఉన్నప్పటికీ, ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ గురి తప్పిందా..? అంటే ఇటీవల అసెంబ్లీలో చోటుచేసుకున్న వరుస పరిణామాలను గమనిస్తే ఈ ప్రశ్నకు 'అవుననే' సంకేతాలే కనిపిస్తున్నాయి. సభలో ప్రజా ఎజెండాను మొదటి స్థానంలో పెట్టాల్సింది పోయి, కాంగ్రెస్ విసిరిన రాజకీయ వివాదాలు, సవాళ్ల ఉచ్చులోనే చిక్కుకుని బిఆర్ఎస్ తన శక్తినంతా కౌంటర్లకే వెచ్చిస్తోందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

నిజానికి ప్రభుత్వాన్ని క్షేత్రస్థాయి సమస్యలపై కట్టడి చేసేందుకు బిఆర్ఎస్ వద్ద పదునైన అంశాలు ఉన్నాయి. రైతుల రుణమాఫీ బకాయిలు,

తరువాయి 3లో...

## బొద్దింకగా మారాలేమో..



- బొద్దింకల ప్రపంచంలోనే శాంతి ఉందేమో
- రూ. 14వేల కోట్లు గుంజేసిర్రు
- నా మిగతా డబ్బు ఎప్పుడు ఇస్తారు?
- రుణం కంటే రికవరీయే ఎక్కువ
- మోసగాడిని ఎలా అంటారు?
- పారిపోయాననడం అబద్ధం..
- అప్పు తీరిపోయాక 'భగోడా' ఎలా అవుతా?
- ఎక్స్‌లో విజయ్ మాల్యా వరుస ట్వీట్ల సంచలనం

3

# కోతలే.. కోతలు..!

- భారీగా కరెంట్ కట్టింగ్స్..!
- త్రీ ఫేజ్ 10 గంటలే..! | కొన్నిచోట్ల 8 గంటలు..!
- ఏదైనా అంతరాయం ఏర్పడితే
- 6 నుంచి 7 గంటలే దిక్కు..!
- టూ ఫేజ్‌కూ కోతే..!
- గంటన్నర నుంచి రెండు గంటలు కట్..!
- ప్రతీ నిత్యం ఆందోళనలు,
- ధర్నాలతో రైతుల నిరసనలు..!
- సబ్‌స్టేషన్ల వద్ద నిత్యకృత్యమైపోయిన బైఠాయింపులు..!
- కరెంట్ కోతలపై అన్నదాత గరం గరం..!

3



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** కాంగ్రెస్ వస్తే కాలం కాదు..! కరెంట్ ఇవ్వదు...! జమానా నుంచి ఇదో నానుడి ఉంది. ఈ సామెత పెద్దలెవ్వరు చెప్పారో.. కానీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తే మాత్రం ఇందుకు తగ్గట్లే కనిపిస్తున్నాయి. గత పదేళ్లుగా కాలం బాగానే అయ్యింది. వర్షాలు భారీగానే కురిసినయ్. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన త్రీ ఫేజ్ విద్యుత్ అందింది. నాణ్యమైన విద్యుత్ సరఫరా వల్ల పంటల దిగుబడి పెరగడమే కాకుండా, బోర్లూ పెద్దగా కాలేవి కావు. ఇప్పుడు ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎల్‌నినో వల్ల ఈసారి వర్షపాతం దారుణంగా పడిపోయింది. దాదాపు వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. మృగశిర, ఆరుద్ర కార్తెల్లో వరుణదేవుడి కరుణతో కాస్తా వర్షాలు ఎక్కువగానే పడడంతో అన్నదాత పెద్ద ఎత్తున ఈసారి కూడా వరిని సాగు చేసుకున్నారు. ఆ తర్వాత కార్తెల్లో వర్షాలు పెద్దగా పడకపోవడంతో.. విద్యుత్ వినియోగానికి భారీగా డిమాండ్ ఏర్పడింది. వేసిన పంటలను బ్రతికించుకునేందుకు అన్నదాతలు వ్యవసాయ బావులు, బోర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలోనే గత ఖరీఫ్ సీజన్ కన్నా ఈసారి రైతు విద్యుత్ వినియోగాన్ని పెంచారు.

వాస్తవానికి ఖరీఫ్ సీజన్ నుంచే ప్రభుత్వానికి ఎల్‌నినోపై ఒక స్పష్టమైన అంచనా ఉంది. ఈసారి భారీగా వరినాట్లు వేశారని కూడా సర్కార్ పెద్దలకు తెలుసు. అయినప్పటికీ అందుకు అనుగుణంగా

తరువాయి 3లో...



## రేవంత్ సొంతూరిలో కరెంట్ సెగ

### కరెంట్ కోతలపై రగిలిన రైతాంగం

- కొండారెడ్డిపల్లిలో జాతీయ రహదారి దిగ్బంధం
- కేవలం 6 గంటలే విద్యుత్ వస్తోందంటూ ఆవేదన
- సాగునీరు అందక ఎండిపోతున్న పంటలు
- 24 గంటల విద్యుత్ ఇస్తేనే కదులుతాం
- కేసీఆర్ హయామే మేలంటూ రైతుల ఆందోళన

**శనార్తి తెలంగాణ, నాగర్‌కర్నూల్ :**

రాష్ట్రంలో వ్యవసాయానికి విద్యుత్ కోతలు పెరిగిపోతున్నాయంటూ రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత ప్రాంతమైన నాగర్‌కర్నూల్ జిల్లాలో గురువారం విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులు రోడ్డుకెక్కారు. కొండారెడ్డిపల్లి సమీపంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీ సంఖ్యలో చేరుకున్న రైతులు మెరుపు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆకస్మిక ఆందోళనతో

తరువాయి 2లో...



## రామంతపూర్లో ఉద్రిక్తత..!

- ప్రభుత్వ కళాశాల వద్ద టెన్షన్
- పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా
- జీఓ నెం : 97 ను రద్దు చేయాలి
- ప్రభుత్వం స్పందించాలి
- విద్యార్థులను అడ్డుకున్న పోలీసులు
- ఇరువర్గాల మధ్య తోపులాట
- పలువురికి స్వల్ప గాయాలు

2

# మోక్షమెప్పుడు..?

### ఫీజు రీయింబర్స్మెంట్స్ ఎప్పుడిస్తారు..?

- రూ.వేల కోట్ల బకాయిలు ఉన్నాయి
- ప్రైవేట్ కాలేజీలు వేధిస్తున్నాయి
- విద్యార్థులు ఫీజు చెల్లించలేక
- 89 వేల మంది చదువు మానేశారు
- దినసరి కూలీలుగా మారుతున్నారు
- ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ ఎప్పుడు..?
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్కాన్ సేవల కొరత
- ఎమ్ఆర్ఐ,సిటి స్కాన్ మిషన్లు ఎన్ని ఇచ్చారు..?
- వీటన్నింటిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలి
- శాసనమండలిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** శాసనమండలిలో గురువారం జరిగిన చర్చ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విద్యా, వైద్య రంగ సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాగ్నస్టిక్ సేవల కొరత వంటి సమస్యలపై గళమెత్తారు.

తరువాయి 3లో...



# సెక్రటేరియట్లో ఏసీబీ రైడ్..!

- లంచం తీసుకుంటూ దొరికిన ఉద్యోగులు
- సీఎంఆర్ఎఫ్ చెక్కు కోసం రూ.లక్ష డిమాండ్
- ఏసీబీకి ఫిర్యాదు చేసిన బాధితుడు
- రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న అధికారులు
- లంచం సొమ్ము స్వాధీనం, కేసు నమోదు



3



## దివ్యాంగులకు కీలక అప్డేట్

- పింఛన్ల దరఖాస్తుకు సెప్టెంబర్ 15 చివరి గడువు
- ఇప్పటివరకు 1,23,199 దరఖాస్తులు
- పరిశీలన తర్వాత పింఛన్లు మంజూరు
- వివరాలు వెల్లడించిన మంత్రి సీతక్క

2

# ట్రంప్‌నా.. మజాకానా..

- మమ్మల్ని గెలిపిస్తే.. మనిషికి రూ.4.76 లక్షలు
- 1 ట్రిలియన్ డాలర్ల భారం
- అమెరికా ఎన్నికల్లో ఉచిత హామీలు
- ఓటర్లను ఆకట్టుకునేందుకు ట్రంప్ మాస్టర్ ప్లాన్



2

అమెరికా మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర రాజకీయ ప్రతికూలతల నడుమ ఒక సంచలన ప్రకటన చేశారు. రాబోయే ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్)తో పాటు సెనేట్‌లోనూ మెజారిటీ నిలబెట్టుకుంటే, ప్రతీ అమెరికన్ వయోజనుడికి సుమారు రూ.4.2 లక్షలు చొప్పున నగదు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

# ఏపీలో భారీ చోరీ

- 46 సవర్ల బంగారం, 2.4 కిలోల వెండి దొంగతనం
- రూ.2 లక్షల నగదు మాయం
- పల్నాడు జిల్లా యడ్లపాడులో ఘటన



**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌లో భారీ చోరీ జరిగింది. పల్నాడు జిల్లా యడ్లపాడులో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. యడ్లపాడుకు చెందిన పార్వతి వ్యక్తిగత పనుల నిమిత్తం తన ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు పార్వతి ఇంటిని లూటీ చేశారు. ఇంటి తాళాలు పగులకొట్టి 46 సవర్ల బంగారం, 2.4 కిలోల వెండిని చోరీ చేశారు. వీటితో పాటు రూ.2 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే యడ్లపాడు పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రాథమిక విచారణ తర్వాత కేసు నమోదు చేసి దర్యాప్తును మొదలెట్టారు. దొంగతనం చేసిన దుండగుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. దగ్గరలోని సీసీ ఫుటేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలోనే ఈ కేసులో పురోగతి సాధిస్తామని, నిందితులను తప్పకుండా పట్టుకుంటామని యడ్లపాడు పోలీసులు వెల్లడించారు.

# ఢిల్లీకి బిఆర్ఎస్ బృందం..!

- ఎన్ హెచ్ ఆర్ సి మహిళా కమిషన్ను కలవనున్న ఎమ్మెల్యేలు
- అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలపై ఫిర్యాదు చేయనున్న నేతలు
- జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులు, శాంతిభద్రతల పరిరక్షణ మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన వివాదాలపై జాతీయ స్థాయి సంస్థలకు ఫిర్యాదు చేయాలని బిఆర్ఎస్ నాయకత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జాతీయ మహిళా కమిషన్ (NCW),జాతీయ మానవ హక్కుల కమిషన్ ఎన్ హెచ్ ఆర్ సి అధికారులను కలిసేందుకు బిఆర్ఎస్ ముఖ్య నేతల బృందం గురువారం దేశ రాజధాని ఢిల్లీకి బయలుదేరింది. ఈ బృందంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీష్ రెడ్డి, సునీతా లక్ష్మా రెడ్డిలతో పాటు ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్సీ వాణిదేవి తదితరులు ఉన్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వద్ద ఆందోళనల సమయంలో జరిగిన ఘటనలు, తమ పార్టీ నేతలు, మహిళా సిబ్బందిపై అధికార పక్షం ప్రవర్తించిన తీరును వివరిస్తూ ఆధారాలతో కూడిన ఫిర్యాదు పత్రాన్ని కమిషన్లకు అందజేయనున్నారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలను ప్రస్తావించకుండా ప్రభుత్వం అణచివేత ధోరణి అవలంబిస్తోందని, పోలీసుల తీరు సరిగా లేదని బిఆర్ఎస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. కమిషన్ల ఎదుట వాదనలు వినిపించిన అనంతరం తమ భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టత ఇవ్వనున్నట్లు నేతలు తెలిపారు. ఈ అనుకోని పర్యటనపై తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది.




# దివ్యాంగులకు కీలక అప్డేట్

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణలో అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 చివరి తేదీ అని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4,66,351 మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారని చెప్పారు. ఇప్పటివరకు దివ్యాంగుల పింఛన్ల కోసం 1,23,199 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అర్హత ఉన్నవారికి పింఛన్లు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. గురువారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. థలసేమియా బాధితులకు పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారని తెలిపారు. సదరం సర్టిఫికెట్లను గడువులోగా రెన్యువల్ చేసుకోకపోవడం వల్ల కొందరికి పింఛన్లు నిలిచిపోతున్నాయని సీతక్క చెప్పారు. అర్హులైన వారు తమ సదరం సర్టిఫికెట్లను తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని.. దివ్యాంగులు ప్రతి ఒక్కరు సెంప్టెంబర్ 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని సీతక్క సూచించారు.



# రామంతపూర్లో ఉద్రిక్తత..!

- ప్రభుత్వ కళాశాల వద్ద టెన్షన్
- పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా
- జీఓ నెం : 97 ను రద్దు చేయాలి
- ప్రభుత్వం స్పందించాలి
- విద్యార్థులను అడ్డుకున్న పోలీసులు
- ఇరువర్గాల మధ్య తోపులాట
- పలువురికి స్వల్ప గాయాలు


**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో గురువారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై స్పందించాలని డిమాండ్ చేస్తూ కళాశాల విద్యార్థులంతా ఏకమై భారీ ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆందోళన తెలుపుతున్న విద్యార్థులను అడ్డుకునేందుకు పోలీసులు యత్నించడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, ఘర్షణ వాతావరణం ఏర్పడింది. విద్యార్థులను చెదరగొట్టే క్రమంలో తీవ్ర తోపులాట జరిగింది. ఈ క్రమంలో బ్యాలెన్స్ తప్పి కిందపడిపోవడంతో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థులు నిరసనను మరింత ఉధృతం చేశారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు కళాశాల ప్రధాన ద్వారాలను మూసివేసి ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

న్యూస్ కవరేజ్ కోసం వచ్చిన మీడియా ప్రతినిధులను కళాశాల లోపలికి అనుమతించకుండా గేట్ వద్దే అడ్డుకున్నారు. మీడియాను నిలువరించడంపై విలేకరులు, విద్యార్థి సంఘాల నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసు చర్యలపై విద్యార్థులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విద్యార్థి లోకానికి నష్టం చేకూర్చే జీవో నం.97పై ప్రజాస్వామ్యబద్ధంగా తమ సమస్యలను తెలపడానికి నిరసన తెలుపుతుంటే, పోలీసులు ఈ విధంగా దౌర్జన్యంగా ప్రవర్తించడం ఎంతమాత్రం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో అదనపు బలగాలను మోహరించడంతో కళాశాల పరిసర ప్రాంతాల్లో హైటెన్షన్ వాతావరణం కొనసాగింది.



# ఆప్ నా ఎక్స్ గర్ల్‌ఫ్రెండ్

- నేను ఎప్పుడో మూవ్ ఆన్ అయ్యా
- ఆప్ ఇంకా నా పేరు పిలుస్తోంది
- ఆప్-చద్దా మధ్య మాటల యుద్ధం
- నా జపం మానేసి.. పంజాబ్‌లో డ్రగ్స్ ఆపండి
- ఓటర్ లిస్ట్ రచ్చపై చద్దా కౌంటర్



**శనార్తి తెలంగాణ, న్యూఢిల్లీ :** ఢిల్లీ ఓటర్ల జాబితా వివాదం అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బీజేపీ మధ్య తీవ్ర రాజకీయ ఘర్షణకు దారితీసింది. ఆప్ నుంచి ఇటీవల బీజేపీలో చేరిన రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా ఓటర్ లిస్టులో తన పేరు నమోదుపై వస్తున్న విమర్శలకు అత్యంత సెటైరికల్ శైలిలో కౌంటర్ ఇచ్చారు. ఆప్ తనను ఇంకా మర్చిపోలేకపోతోందని, విడిపోయిన ఎక్స్-గర్ల్ ఫ్రెండ్ లా ప్రవర్తిస్తోందని ఎద్దేవా చేశారు. రాజేందర్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో రాఘవ్ చద్దా పేరు చేర్చడంపై ఆప్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆప్ జాతీయ మీడియా ఇన్‌చార్జ్ అనురాగ్ ధండా మాట్లాడుతూ, సెప్టెంబర్ 1 నుంచి 7 మధ్య వచ్చిన ఫారమ్-6 దరఖాస్తుల్లో చద్దా పేరు లేదని ఆరోపించారు. ఆగస్టు 31న విడుదలైన ముసాయిదా జాబితాలో కేవలం 746 వరుస సంఖ్య వరకు మాత్రమే ఎంట్రీలు ఉన్నాయని, అలాంటిది 747వ స్థానంలో రాఘవ్ చద్దా పేరు ఉన్నపలంగా ఎలా ప్రత్యక్షమైందో కేంద్ర ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆప్ ఆరోపణలను చద్దా తీవ్ర స్థాయిలో తిప్పికొట్టారు. "నేను రాజకీయంలో ఎప్పుడో ముందడుగు వేశాను. కానీ ఆప్ మాత్రం నా పాత జ్ఞాపకాలట్లోనే బతుకుతూ ప్రతిరోజూ నా పేరే కలవరిస్తోంది. ఓ బాయ్ ఫ్రెండ్ మూవ్ ఆన్ అయినా, అతని గురించే కలలు కంటూ నిందలు వేసే మాజీ ప్రియురాలిలా ఆప్ వ్యవహరిస్తోంది" అని ఎద్దేవా చేశారు. ఢిల్లీ పంచాయితీతో పాటు పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వాన్ని కూడా చద్దా గట్టిగా టార్గెట్ చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారి వల్ల యువత తీవ్రంగా నష్టపోతోందని, మత్తు పదార్థాల కోసం ప్రజలు క్యూలు కట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.

# ట్రంప్‌నా.. మజాకానా..



**శనార్తి తెలంగాణ, వాషింగ్టన్ :** అమెరికా మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర రాజకీయ ప్రతికూలతల నడుమ ఒక సంచలన ప్రకటన చేశారు. రాబోయే ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్)తో పాటు సెనేట్‌లోనూ మెజారిటీ నిలబెట్టుకుంటే, ప్రతీ అమెరికన్ వయోజనుడికి సుమారు రూ.4.2 లక్షలు చొప్పున నగదు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రత్యేక చెల్లింపునకు ట్రంప్ డివిడెండ్‌గా నామకరణం చేస్తామని తెలిపారు. డలాస్‌లో ఏర్పాటు చేసిన రిపబ్లికన్ పార్టీ ప్రతినిధుల సదస్సులో పాల్గొన్న ట్రంప్ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. బ్యాలెట్ పేపర్‌పై తన పేరు నేరుగా లేకపోయినప్పటికీ, తననే అభ్యర్థిగా భావించి రిపబ్లికన్ ప్రజాప్రతినిధులకు ఓటేయాలని ఓటర్లను కోరారు. "రిపబ్లికన్లను గెలిపిస్తే దేశం సాధించే ఆర్థిక విజయంలో భాగస్వాములుగా మీకు 5వేల డాలర్లు లభిస్తాయి" అని స్పష్టం చేశారు. ఈ భారీ ఆర్థిక సాయానికి కావలసిన నిధుల సమీకరణ విధానంపై ఆయన స్పష్టమైన వివరాలు వెల్లడించనప్పటికీ, దేశ ఆర్థిక పురోగతి ద్వారానే ఇది సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు. అమెరికాలోని దాదాపు 24 కోట్ల పైచిలుకు వయోజన పౌరులకు ఈ హామీని వర్తింపజేస్తే ప్రభుత్వ ఖజానాపై కనీసం 1 ట్రిలియన్ డాలర్ల నుంచి 1.3 ట్రిలియన్ డాలర్ల వరకు అదనపు భారం పడుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే బడ్జెట్ లోటు పెరుగుతున్న తరుణంలో ఈ పథకం ఆచరణ సాధ్యమేనా అన్న కోణంలో విశ్లేషణలు మొదలయ్యాయి. తన ప్రసంగంలో ఇరాన్‌తో జరుగుతున్న సైనిక ఘర్షణ అంశాన్ని ట్రంప్ ప్రధానంగా ప్రస్తావించారు. ఇరాన్ అణ్వాయుధ తయారీకి చేరువవ్వడం వల్లే యుద్ధానికి దిగాల్సి వచ్చిందని సమర్థించుకున్నారు. సైనిక చర్య ముగిసిన వెంటనే చమురు ధరలు భారీగా తగ్గుముఖం పడతాయని, అంతర్జాతీయ వ్యాపారంలో సుంకాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా భవిష్యత్తులో అమెరికాకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు.



# చైనాలో ఘోర ప్రమాదం

- కార్గో నౌకలో మంటలు
- 20 మంది మృతి మరో 5గురు గల్లంతు
- తూర్పు చైనా కింగ్‌డావోలో ఘటన

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** తూర్పు చైనాలోని కింగ్‌డావోలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కింగ్‌డావోలోని బీహై షిప్‌బిల్డింగ్ యార్డులో మరమ్మతుల కోసం నిలిపి ఉంచిన ఓషన్ మెలోడీ కార్గో నౌకలో గురువారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. లైబీరియా జెండాతో నడిచే ఈ డ్రై బల్క్ కార్గో నౌకలో ప్రమాద సమయంలో 42 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మంటలు ఒక్కసారిగా పెద్దఎత్తున వ్యాపించడంతో నౌకలో ఉన్నవారిని బయటకు తరలించేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. 12 మందిని సురక్షితంగా బయటకు తీసుకురాగా, ఐదుగురు గాయపడి చికిత్స పొందుతున్నారు. మంటల్లో చిక్కుకున్న వారిలో ఇప్పటివరకు 20 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు నిర్ధారించారు. మరో ఐదుగురి ఆచూకీ ఇంకా లభించలేదు. మృతుల్లో నౌక సిబ్బందితో పాటు షిప్‌యార్డులో పనులు చేస్తున్న కార్మికులు ఉన్నట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందిన వెంటనే పెద్ద సంఖ్యలో అగ్నిమాపక, సహాయక బృందాలు అక్కడికి చేరుకుని మంటలను నియంత్రించాయి. నౌకలోని కొన్ని భాగాల్లో అధిక ఉష్ణోగ్రతలు, పొగ కారణంగా సహాయక చర్యలు క్లిష్టంగా మారాయి. అయినప్పటికీ గల్లంతైన వారి కోసం ప్రత్యేక బృందాలు నౌక అంతర్భాగాల్లో గాలింపు చేపట్టాయి. ఈ ప్రమాదంలో ఇంత భారీగా ప్రాణనష్టం జరగడానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. నౌకలో మరమ్మతు పనులు జరుగుతున్న సమయంలోనే మంటలు చెలరేగడంతో వెల్డింగ్, ఇతర పనుల వల్ల ప్రమాదానికి ఏమైనా కారణం అయ్యి ఉండవచ్చా..? అనే కోణంలోనూ విచారణ చేస్తున్నారు.



# రేవంత్ సొంతూరిలో కరెంట్ సెగ

**మొదటిపేజీ తరువాయి...**

జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయి కిలోమీటర్ల మేర తీవ్ర ట్రాఫిక్ జాం ఏర్పడింది. పంట పొలాలకు రోజుకు కేవలం 6 నుంచి 8 గంటలు మాత్రమే విద్యుత్ ఇస్తున్నారని, అది కూడా విడతల వారీగా రావడం వల్ల బావుల వద్ద నీటిని సరిగా తోడుకోలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ లేక సాగునీరు అందక పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. పొలాలను కాపాడుకోవడానికి విద్యుత్ సరఫరా పెంచాలని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతోనే రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించారని, ఆ సమయంలో ఎలాంటి పంట నష్టం జరగలేదని రైతులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తప్పు చేశామంటూ కొందరు రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మళ్లీ కేసీఆర్ హయాం వస్తేనే తమ బతుకులు బాగుపడతాయని అభిప్రాయపడ్డారు. పంట పొలాలకు నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని రైతులు స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, స్థానిక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

# మోక్షమెప్పుడు..?

**మొదటిపేజీ తరువాయి...**

వరంగల్ జిల్లాలో జెంజి సమావేశంలో అవంతిక అనే విద్యార్థిని చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిల అంశాన్ని మల్లన్న మండలిలో ప్రస్తావించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రూ. 8,591 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు పేరుకుపోయాయని, డిసెంబర్ 2023 నాటికే గత ప్రభుత్వ హయాంలో రూ. 5,435 కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో కలిపి మొత్తం రూ. 11,467 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం రూ. 2,875 కోట్లు మాత్రమే విడుదల చేసిందని అన్నారు.
ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నప్పటికీ, విడుదలలో భారీ కోతలు విధించడం వల్ల ప్రతి సంవత్సరం బకాయిలు పెరుగుతున్నాయని అన్నారు. 2014-15 నుంచి వరుసగా నిధుల విడుదలలో కోతలు విధించడం వల్ల 2023-24 నాటికి బకాయిలు వేల కోట్ల రూపాయలకు చేరాయని పేర్కొన్నారు. జీవో నంబర్ 7 స్థానంలో జీవో నంబర్ 9 తీసుకువచ్చి విద్యార్థుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తామని చెప్పడం వల్ల అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులపై ఫీజుల ఒత్తిడి పెంచుతున్నాయని తెలిపారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో టీసీలు, సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నారని మల్లన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్‌లు అందక 89 వేల మంది విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేసి దినసరి కూలీలు, బాలకార్మికులుగా మారడం అత్యంత ఆందోళనకరమని అన్నారు.

### ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ ఎప్పుడు..?

ఆశ్రమ పాఠశాలల భాషా పండితులు, పీఈటీలకు న్యాయం చేయాలని తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. సాధారణ ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలల్లో భాషా పండితులు, పీఈటీలను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసినట్లే ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులు, పీఈటీలను కూడా వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని మల్లన్న డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆశ్రమ పాఠశాలల్లో ఎంతమంది భాషా పండితులు, పీఈటీలు పనిచేస్తున్నారు, వారిలో ఎంతమందికి ఇంకా అప్‌గ్రేడేషన్ జరగాల్సి ఉందో ప్రభుత్వం స్పష్టమైన లెక్కలు వెల్లడించాలని కోరారు. అప్‌గ్రేడేషన్ లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు పే



స్కేలు, ప్రమోషన్లు, పెన్షన్ ప్రయోజనాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయిందని, తెలంగాణలో మాత్రం ఇంకా పెండింగ్‌లో ఉంచడం సరైన విధానం కాదన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాగ్నస్టిక్ సేవలపై ప్రశ్న..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో MRI, CT స్కాన్ సేవల కొరత, సిబ్బంది సమస్యలు, పేద రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మల్లన్న ఆరోగ్య శాఖను ప్రశ్నించారు. 2026 మార్చి నాటికి 8ఎమ్ఆర్ఐ, 8 సిటి స్కాన్ యంత్రాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటివరకు ఎన్ని ఏర్పాటు చేశారో, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో వివరాలు వెల్లడించాలని కోరారు. రేడియాలజిస్టులు, టెక్నీషియన్ల కొరత కారణంగా గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఎంఎన్‌జే వంటి ప్రధాన ఆసుపత్రుల్లో ఎమ్ఆర్ఐ, సిటి స్కాన్ పరీక్షల కోసం రోగులు వారం రోజుల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాగ్నస్టిక్ సేవల బలోపేతం వంటి అంశాల్లో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు.



## బొద్దింకగా మారాలేమో..

- బొద్దింకల ప్రపంచంలోనే శాంతి ఉందేమో
- రూ. 14వేల కోట్లు గుంజేసిర్రు
- నా మిగతా డబ్బు ఎప్పుడు ఇస్తారు?
- రుణం కంటే రికవరీయే ఎక్కువ
- మోసగాడిని ఎలా అంటారు?
- పారిపోయాననడం అబద్ధం..
- అప్పు తీరిపోయాక 'భగోడా' ఎలా అవుతా?
- ఎక్స్‌లో విజయ్ మాల్యా వరుస ట్వీట్ల సంచలనం

**శనార్తి తెలంగాణ, న్యూఢిల్లీ :** కింగ్‌ఫిషర్ సంస్థల మాజీ అధినేత, మద్యం వ్యాపారి విజయ్ మాల్యా సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్టులు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తనను ఇప్పటికీ 'పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడు' (భగోడా) అని సంబోధించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. భారత్ తన విషయంలో తీవ్ర అన్యాయంగా ప్రవర్తించిందని, ఈ పరిస్థితుల కంటే బొద్దింకగా మారిపోతేనే జీవితం ప్రశాంతంగా ఉండేదేమోనంటూ ఎక్స్ ఖాతా ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. భారత్‌కు తిరిగొచ్చేందుకు తాను నిరాకరిస్తున్నానని వస్తున్న వార్తలపై మాల్యా స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు. 1992 నుంచి తాను బ్రిటన్‌లో శాశ్వత నివాసిగా ఉన్నానని, అక్కడి చట్టపరమైన నిబంధనలు మరియు విచారణల వల్ల దేశం విడిచి వెళ్లడానికి అనుమతి లేదని పేర్కొన్నారు. బ్యాంకుల బకాయిల చెల్లింపులకు, ఒక వ్యక్తి భౌతికంగా ఏ దేశంలో ఉన్నాడనే దానికి సంబంధం లేదని వ్యాఖ్యానించారు. బొంబాయి హైకోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమర్పించిన అఫిడవిట్‌ను ప్రస్తావిస్తూ మాల్యా పలు గణాంకాలను బయటపెట్టారు. 2021 నాటికే తన ఆస్తుల నుంచి రూ.14,131.60 కోట్లకు పైగా స్వాధీనం చేసుకుని బ్యాంకులకు బదిలీ చేసినట్లు ఈడీ స్పష్టంగా పేర్కొందని గుర్తుచేశారు. తను తీసుకున్న రుణ బకాయిల కంటే ఎక్కువ మొత్తాన్ని దర్యాప్తు సంస్థలు ఇప్పటికే రాబట్టాయని, అలాంటప్పుడు తనను ఇంకా 'మోసగాడు' అని పిలవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రికవరీల ప్రక్రియ పూర్తయ్యాక మిగిలిన తన సొమ్మును ఎప్పుడు తిరిగి ఇస్తారో మీడియా ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంటులో ప్రకటించిన పరారీలో ఉన్న నేరస్థుల జాబితాలో మాల్యా పేరు కూడా ఉంది. తాజాగా మాల్యా చేసిన ఈ వ్యాఖ్యలు, విసిరిన సవాళ్లపై కేంద్ర ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు ఎలా స్పందిస్తాయో వేచి చూడాల్సి ఉంది.




## రేపటి నుంచే బ్రిక్స్ సదస్సు

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** భారత్ వేదికగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు శనివారం నుంచి రెండు రోజుల పాటు జరగనుంది. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఈ కీలక సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహా పలు దేశాల అధినేతలు, ప్రతినిధులు హాజరుకానున్నారు. బ్రిక్స్ సదస్సును పురస్కరించుకొని పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి వస్తుండడంతో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. దాదాపు 15 వేల మంది ఢిల్లీ పోలీసులతో ప్రత్యేక బందోబస్తు చేపట్టారు. కేంద్ర బలగాలు, ఇతర భద్రతా విభాగాల సిబ్బంది కూడా విధుల్లో ఉండనున్నారు. భారత్ మండపం, విమానాశ్రయం, ప్రముఖులు బస చేసే హోటళ్లు, వారి రాకపోకల మార్గాల్లో బహుళస్థాయి భద్రతను అమలు చేస్తున్నారు. అనుమానాస్పద కదలికలను గుర్తించేందుకు కీలక ప్రాంతాల్లో ప్రత్యేక కెమెరాలతో నిరంతర నిఘా కొనసాగుతోంది. అగ్రనేతల రాకపోకల నేపథ్యంలో ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నారు. ప్రముఖుల కాన్వాయ్‌లు వెళ్లే సమయంలో కీలక మార్గాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించడంతో పాటు అవసరమైన చోట్ల దారి మళ్లింపులు చేపట్టనున్నారు. సదస్సుకు వచ్చే విదేశీ ప్రతినిధులు, అధికారులు, భద్రతా సిబ్బంది కోసం నగరంలోని ప్రముఖ హోటళ్లలో సుమారు 3 వేల గదులను ముందుగానే బుక్ చేశారు. మొన్నటి వరకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఈ సమావేశానికి వస్తారా..? లేదా..? అనే మీమాంస ఉండేది. కానీ, ఆ దేశం జీన్‌పింగ్ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు రానున్నట్లు ప్రకటించడంతో ఈ సదస్సుకు మరింత ప్రాధాన్యత ఏర్పడినట్లైంది.

## కాంగ్రెస్ ట్రాప్‌లో బీఆర్ఎస్?

**మొదటిపేజీ తరువాయి...**

ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లు, ఆర్టిజన్ కార్మికులు, ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు, 22 ఏ నిషేధిత భూముల వివాదం,ఆసరా పింఛన్ల అమలులో జరుగుతున్న ఆలస్యంపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసే అవకాశం ప్రతిపక్షానికి చిక్కింది. శాసనసభ వేదికగా జరిగిన పరిణామాలు ఈ చర్చ తీవ్రతను పూర్తిగా మార్చేశాయి. అసెంబ్లీ గేటు వద్ద నిరసనలు, పోలీసులతో తోపులాట, కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, స్పీకర్ స్థానాన్ని ఉద్దేశించి వచ్చిన విమర్శలు, ఆపై సభలో ఘర్షణలు బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వరుస సస్పెన్షన్లు మాత్రమే ప్రధాన మీడియా వార్తలుగా మారాయి. ఫలితంగా "ప్రభుత్వం ప్రజా సమస్యలకు ఏం సమాధానం చెప్పింది?" అనే ప్రశ్న కంటే "ఎవరు ఎవరిని విమర్శించారు? ఎవరు పరిధులు దాటారు? అన్నదే ప్రధాన రాజకీయ చర్చగా మారింది. ఈ రాజకీయ ఘర్షణను కాంగ్రెస్ పార్టీ మరింత వ్యూహాత్మకంగా సామాజిక సమీకరణాల వైపు మళ్లించడంలో విజయం సాధించింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి ప్రతిపక్షం చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేరుగా 'దళిత ఆత్మగౌరవంపై దాడి'గా చిత్రీకరించింది. దీనికి తోడు ఎర్రవల్లి ఫార్మ్‌హౌస్ వద్ద పరిణామాలపై విచారణ అధికారిని నియమించడం ద్వారా బిఆర్ఎస్‌పై సామాజిక ముద్ర వేసే ప్రయత్నం జరిగింది. ఈ సభా రచ్చ దాటికి గతంలో తీవ్ర దుమారం రేపిన పలు వివాదాలు, పొలిటికల్ డిమాండ్లు సైతం ప్రాధాన్యత కోల్పోయి నెమ్మదించాయి. అంతేకాకుండా, కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఉన్నాయనే ప్రచారానికి చెక్ పెడుతూ, ప్రతిపక్ష దాడిని తిప్పికొట్టేందుకు సీతక్క, భట్టి విక్రమార్క,





శ్రీధర్ బాబు వంటి కీలక నేతలంతా అధికార పక్షం తరఫున ఏకతాటిపైకి వచ్చి బలమైన కౌంటర్ ఇచ్చే వాతావరణం ఏర్పడింది.

రాజకీయాల్లో ఎవరైతే పొలిటికల్ ఎజెండాను నిర్దేశిస్తారో, వారే ఆధిపత్యంలో నిలుస్తారు. ప్రతిపక్షం తన శక్తినంతా అధికార పక్షం విసిరే వివాదాస్పద అంశాలకు ప్రతిస్పందించడానికే ఖర్చు చేస్తే, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అసలు సమస్యలు పక్కదారి పడతాయి. ఈ పరిణామాలు రేవంత్ రెడ్డి పన్నిన వ్యూహమా లేక పరిణామాలు ఆయనకు అనుకూలించాయా అనేది పక్కనబెడితే—ప్రస్తుతానికి ప్రతిపక్షం కాంగ్రెస్ క్రియేట్ చేసిన రాజకీయ చట్రంలోనే ఉండిపోయింది. బిఆర్ఎస్ తక్షణమే ఈ ఎమోషనల్ అటాక్స్ నుంచి బయటపడి, రేవంత్ రెడ్డి నిర్దేశిస్తున్న రాజకీయ ఎజెండాలో కాకుండా, గణాంకాలు మరియు క్షేత్రస్థాయి ప్రజా సమస్యల ఆధారిత రాజకీయం వైపు మళ్లినప్పుడే ఈ పొలిటికల్ ట్రాప్ నుంచి బయటపడటం సాధ్యమవుతుంది.



## సెక్రటెరియట్లో ఏసీబీ రైడ్.!

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణలో కొందరు అధికారుల తీరు మారడం లేదు. సామాన్యులకు అందించే అత్యవసర సహాయంలోనూ కొందరు అధికారుల తీరు మారకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చిన్న పనులకు కూడా లంచం డిమాండ్ చేస్తూ అధికారులను పీడిస్తున్నారు. గురువారం ఏకంగా రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి సెక్షన్‌లో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్, ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడిన ఘటన ఆచర్యానికి గురిచేస్తుంది. రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇచ్చేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు బాధితుడు తెలిపాడు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించాగా పక్కా ప్రణాళికతో అధికారులు రంగంలోకి దిగారు. సచివాలయ ప్రాంగణంలో నిఘా ఏర్పాటు చేశారు. బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా పట్టుకుని రూ.లక్ష లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఆ ఉద్యోగిని అరెస్టు చేశారు. సీఎంఆర్ఎఫ్ సెక్షన్‌లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ స్థాయి వ్యక్తి చెక్కు మంజూరు కోసం ఏకంగా 50 శాతం లంచం డిమాండ్ చేయడం వెనుక మరికొందరి పాత్ర ఉందా? అనే కోణంలోనూ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కోతలే.. కోతలు..!

**మొదటిపేజీ తరువాయి...**

విద్యుత్ సరఫరాను రాష్ట్ర ప్రభుత్వం మెరుగుపర్చలేకపోయింది. అందుకు తగ్గట్లు అవసరమైన ప్రణాళికలను కూడా రూపొందించలేదు. గత శాసన సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వ్యవసాయానికి 24 గంటల నిరంతర ఉచిత త్రీ ఫేజ్ విద్యుత్‌ను అందిస్తామని ప్రకటించింది. ఆ మేరకు తన ఎన్నికల మ్యానిఫెస్టో ఈ అంశాన్ని కూడా చేర్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే 24 గంటల ఫ్రీ కరెంట్ సంగతి దేవుడెరుగు.. త్రీ ఫేజ్ విద్యుత్‌ను 15 గంటలకే పరిమితం చేసేసింది. అంతటితో ఆగకుండా ఆ తర్వాత 12 గంటలే ఇవ్వగలమని డిస్కంల ద్వారా చెప్పించింది. ఇప్పుడు ఆ 12 గంటల త్రీ ఫేజ్ విద్యుత్ కూడా సరిగ్గా రాకపోవడంపైనే అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు నెలల వరకు దాదాపు మెజార్టీ జిల్లాల్లో ఉదయం 5.30 నుంచి సాయంత్రం 5.30 దాకా 12 గంటల పాటు వ్యవసాయానికి త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా అయ్యేది. కానీ, గత కొద్ది రోజులుగా ఆ పన్నెండు గంటలు ఇచ్చే కరెంట్‌కు డిస్కంలు భారీగా కోతలు పెడుతున్నాయి. ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ పరిధిలోని దాదాపు అన్ని చోట్ల పది గంటల త్రీ ఫేజ్ విద్యుతే వస్తోంది.
కొద్ది రోజుల వరకు ఉదయం 5.30 నుంచి ఇచ్చే కరెంట్‌కు రెండు గంటలు కోత పెట్టి మార్నింగ్ 7.30 నుంచి త్రీ ఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. ఇందులోనూ ఏమైనా ఎల్‌సీలు,



ఇతరత్రా అంతరాయాలు ఉంటే మరో రెండు, మూడు గంటల కోత పడుతోంది. దీంతో సరాసరి డిస్కంల నుంచి వ్యవసాయానికి అందుతున్న త్రీ ఫేజ్ విద్యుత్ 7-8 గంటలే ఉంటుండడంపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన కరెంట్‌లోనూ నాణ్యతా ఉండడం లేదని, అందువల్ల బోరు మోటార్లు కాలిపోతున్నాయని టెన్షన్ గురవుతున్నారు. టూ ఫేజ్ కరెంట్‌లోనూ రెండు గంటల పాటు కోతలు పెడుతుండడంపై మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే సర్కార్ తీరును నిరసిస్తూ.. ఇటీవల పెద్ద సంఖ్యలో అన్నదాతలు ఆందోళనలు, నిరసనలకు దిగుతున్నారు. సబ్‌స్టేషన్ల ముట్టడి చేస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాతలు భారీగా రోడ్లపైకి వచ్చారు. ఆగస్టు 6న సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ వద్ద రైతుల ఆందోళనకు దిగి పెద్ద రచ్చే చేశారు. ఇదే నెలలో నల్లగొండ జిల్లా వేంపాడు సబ్‌స్టేషన్ వద్ద అన్నదాతలు నిరసనలు చేశారు. ఆగస్టు 16 మహబూబ్‌నగర్ జిల్లా పోల్కంపల్లి, నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చ్‌ర్ల వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించారు. ఆగస్టు 18 సంగారెడ్డి జిల్లా: అందోల్ మండలం అన్నాసాగర్, జోగిపేట, మాసాన్‌పల్లి, ఆగస్టు 31 జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం గట్టు సబ్‌స్టేషన్ల వద్ద సర్కార్ వ్యతిరేకంగా నిరసనలు చేశారు.
ఇక ఈ నెలలోనూ విద్యుత్ కోతలపై అన్నదాతల నిరసనల జోరు కొనసాగింది. ఈ నెల 02న సూర్యాపేట జిల్లా మోతె మండలం లాల్‌తండా, 03న నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ, బిజినేపల్లి, 04న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ, 06న నారాయణపేట జిల్లా మక్తల్ మండలం దండు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కానుకుర్తి, సెప్టెంబర్ 7న నిర్మల్ జిల్లా కుభీర్, రాజన్న-సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం, జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణరావుపేట, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోజన్‌కొత్తూర్, కేశాపూర్, కామారెడ్డి జిల్లా పాల్వంచ, సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి, తీగుల్ నర్సాపూర్, అంతాయగూడెం గ్రామాల్లో అన్నదాతలు ఆందోళన చేశారు. మరోవైపు ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు విద్యుత్ కోతలకు నిరసన ఆందోళనలకు సిద్ధమవడం గమనార్హం. అయితే విద్యుత్ కోతలను నిరసిస్తూ.. సబ్‌స్టేషన్ల వద్ద రైతుల నిరసనలు నిత్యకృత్యమైపోయినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాత్రం ఏ మాత్రం చలనం రాకపోవడం దారుణం.